# రాత




నర్సిమ్ములు చెరువుకట్టమీద నడుస్తున్నాడు.

హుందాగా ఊరివైపు నడుస్తున్నాడు.

నడుస్తున్న నర్సిమ్ములు ఉన్నట్లుండి ఎవడో జబ్బపట్టి నిలబెట్టినట్లుగా నిలబడిపోయాడు. ఎదురైన ఆకృతిని చూసి ఒక్క క్షణం అదిరిపడ్డాడు.

కుడిచేతిలో మచ్చుకత్తి... ఎడమచేతిలో తల... పూనకం వచ్చినట్లు మనిషి వెనక్కు ముందుకు ఊగుతున్నాడు. ఊగుతూ నడుస్తున్నాడు. కట్టుకున్న బట్టలన్నీ నెత్తురోడుతూ కంపరం పుట్టిస్తున్నాయి. తెగిన తల నుండి ప్రవాహ వేగంతో చిమ్మిన రక్తం ఇప్పుడు బొట్లు బొట్లుగా రూపాంతరం చెంది సెలైన్ బొట్లులాగా పడుతూ ఉంది. చూపుల్లో ఆవేశం... నడకలో వేగం... ఇంకొక్క మనిషి ఎదుటపడితే ఏమవుతుందో పరిస్థితి అన్న సందేహం?

అయినా నిలదొక్కుకుని నిలబడ్డాడు నర్సిమ్ములు.

ఆశ్చర్యం!- ఆ రూపం తనదే!

అయితే ఇప్పటిదికాదు. ఏడేండ్లనాటిది.

సన్నగా నవ్వుకొన్నాడు నర్సిమ్ములు. నవ్వుతూ దృష్టిని కొత్తనీళ్ళతో కొట్టుమిట్టాడుతున్న చెరువు వైపు మళ్ళించాడు.

అతని గుండె బాధగా మూలిగింది.

ఆ నీటి అలలమీద తేలియాడుతున్న స్త్రీ ఆకారం!... తుమ్మెద రెక్కల్లా మెరుస్తున్న చారడేసి కురులు... గోధుమ రంగు కాన్వాసు మీద ముదురు నలుపు రంగులో ముంచి తీసిన కుంచె విన్యాసాన్ని తలపింపచేస్తున్నాయి. చారడేసి కండ్లు ఆ చెరువులో పూసిన కలువరేకులా అనిపిస్తున్నాయి. ఏరి కోరి పోత పోసినట్లున్న ఎత్తుపల్లాలు నీటి అలలతో పోటీ పడుతున్నాయి.

ఆ కుందనపు బొమ్మ కోసం ఇరుసు విరిగిన బండిలా ఆ కట్టమీద కుప్పగా కూలిపోయాడు నర్సిమ్ములు!

ఇప్పుడు కాదు- ఏడేండ్లనాడు!

ఆ తలంపే ఇప్పుడు తపింపచేస్తే చెరువు కట్టమీద ఒక చెట్టు మరుగులో కూర్చున్నాడు. తదేకంగా చెరువు వైపే చూస్తున్నాడు. పొద్దు గూట్లో పడింది. అడవికి మేతకు వెళ్ళిన అలమందల్లో కోడెదూడలు మోరవంచి తోకలు పైకి లేపి ఊరివైపు పరుగులు తీస్తున్నాయి. తాగినవాడి మత్తులాగా క్రమేణా చీకటి కోపెక్కుతూ ఉంది. నర్సిమ్ములు ఆలోచనలు నీటి అలల్లాగా ఒకదాని వెనక ఒకటిగా వెనక్కు వెళ్ళుతున్నాయి.వెళ్ళి వెళ్ళి ఏడేండ్ల వెనక నిలబడ్డాయి!...

'మట్టి పిసికితేనే ముద్ద సంకటి. సదువు సందెల్తో ఏంవన్నా సంగటికొస్తిందా? సదివి సదివి రాజ్జేలేలబొయ్యే దెవుడు?' అని తాతముత్తాతల కాలం నుండి తలపోస్తూనే ఉందా పల్లె. అందుకే పట్టుబట్టి పాతతరం వాళ్ళు గుడి కట్టించుకొన్నారే కాని బడి మాట తలపెట్టలేదు.

ఆ గుడిలో దేవుడు ఉన్నాడు!

ఆ దేవుణ్ణి ఆ ఊరి రెడ్డిగారు పూజిస్తుంటారు.

ఊళ్ళోవాళ్ళందరూ కలిసి రెడ్డిగారిని పూజిస్తుంటారు.

ఏడాదికొకసారి ఏదో ఉత్సవం పేర రెడ్డిగారు దేవుణ్ణి పూజిస్తుంటారు.

ఊళ్ళోవాళ్ళు దినమూ రెడ్డిగారిని పూజిస్తుంటారు.

తాత ముత్తాతల కాలం నుండి దేవుడికి పూజా పునస్కారాదులు జరుగుతున్నా ఆ దేవుడెప్పుడైనా ఎవరికైనా కాసంత సహాయం చేసినట్లు దాఖలాలు లేవు. కానీ, ఊళ్ళోవాళ్ళ పూజలందుకొంటున్న రెడ్డిగారు మాత్రం పెండ్లి పేరంటాలకు కావచ్చు. చావులు సమర్తలకు కావచ్చు. ఎరువు లెంపలు కొనడానికి కావచ్చు. అడిగితే అడ్డం చెప్పిన పాపాన పోలేదు.

రెడ్డిగారు ఇస్తూనే ఉన్నారు. ఊళ్ళోవాళ్ళు రెడ్డిగారిచ్చిన దానికి నిదర్శనంగా తాము తీసుకొన్న దానికి గుర్తుగా వేలి ముద్రలు వేస్తూనే ఉన్నారు.

ఆ పల్లెకు పరుగు దూరంలో మరొక్కపల్లె. ఆ పల్లెలో కరణం. ఆ కరణానికి రెడ్డిగారంటే ప్రాణం. రెడ్డిగారికి కరణమంటే వల్లమాలిన అభిమానం. కరణం ఆ పాయకట్టు లెక్కలు చూస్తూ ఉంటాడు. రెడ్డిగారి లెక్కలు సరిచేస్తూ ఉంటాడు.

రెడ్డిగారికి ఒక కొడుకు ఉన్నాడు. కరణంగారికి ఒక కొడుకు ఉన్నాడు. ఆ కొడుకులు ఇద్దరూ పట్నంలో పై చదువులు చదువుతున్నారు. ఆ పాయకట్టు కంతటికి చదువుకొంటున్నది వాళ్ళిద్దరే!

ఆ ఊళ్ళో మిద్దెలున్నాయి. బిళ్ళ ఇండ్లున్నాయి. మూడంకణాల పూరిండ్లు ఉన్నాయి. చుట్టు గుడిసెలున్నాయి. అన్నింటిలోనూ మనుషులే నివసిస్తున్నారు! నివసించేది మనుషులే అయినా నివసించే విధానంలో ఎంతో వైరుధ్యం!

కొందరికి కడుపులో చల్ల కదలదు!

కొందరికి రెక్కాడితేగాని డొక్కాడదు.

కొందరు ఎండ మొగం ఎరగరు.

కొందరు ఎండవానల్ని వదలి కదలరు.

ఎందుకీ వ్యత్యాసాలని వాళ్ళెప్పుడూ ఆలోచించలేదు. ఆలోచించే ఆస్కారమూ లేదు. కర్మకొద్దీ బతుకులని వాళ్ళ నమ్మకం. నమ్మకంలో తృప్తి ఉంది. తృప్తి మనిషిని ముందుకు నడిపిస్తుంది.

అలా బతుకుతున్నవాళ్ళల్లో చెంగమనాయుడొకడు. నాయుడుగారికి అంతో ఇంతో కయ్యాగాలవ ఉంది. చేనూ చెట్టూ ఉంది. అతగాడికున్న కయ్యా కాలవమీద, చేను చెట్టు మీద ఎవరికీ కన్ను లేదు కానీ, నాయుడు కూతురు రంగమ్మంటే మాత్రం ఆ ఊళ్ళో కురుకురు మీసంవచ్చే కుర్రకారుకంతా కన్ను!

రంగమ్మ ముద్దుల పేరు రంగి!

రంగి!- అంటే ఆ ఊరికే రంగు.

రుసరుసలాడే వయసు....మిసమిసలాడే సొగసు. ఒళ్ళంతా ఒంపు సొంపుల ఒయ్యారాలు- బుట్ట చంకనబెట్టి చెక్కుడు పార భుజానికి తగిలించుకొని రెట్లావు గనిమమీద పోట్లగిత్తలా నడుస్తూంటే- చూడ్డానికి కండ్లు చాలవు.

అందుకే ఆ ఊళ్ళో కుర్రకారుకంతా రంగి మాట చెవిని పడితే చాలు- గుండెల్లో అదోరకమైన పొంగు! రంగి మాత్రం నర్సిమ్ములంటే గుటకలు మింగు!

ఆ ఊళ్ళో నారాయణరెడ్డి కొడుకు నర్సిమ్ములు. రంగి మాటెత్తితే రంగే మారిపోతాడు.

వాళ్ళిద్దరి మనసులు పాలునీళ్ళులా కల గలశాయి. భవిష్యత్తును గురించి తీయతీయని కలలు కంటు ఊహల్లో జీవిస్తున్నాయి.

ఈడూ జోడూ చూసి కూలి కొడవలి చేతి కిమ్మన్నారు పెద్దోళ్ళు. ఇవ్వచ్చు. వాళ్ళ మాటల్లో ఏమాత్రం సత్యమున్నా నిరభ్యంతరంగా కూలి కొడవళ్ళు చేతికివ్వచ్చు. అయితే మూఢత్వం ముసురుకొన్న ఆ పల్లెలో కులాల అడ్డుగోడల్ని కూలదోసేదెవరు?

చెంగమ నాయుడుకున్నంత కయ్యా గాలవ చేనూ చెట్టూ నారాయణరెడ్డికీ ఉంది. నారాయణ రెడ్డికున్నంత ఇరుపు చెంగమనాయుడికీ ఉంది. వియ్యానికైనా కయ్యానికైనా కావలసింది సమత్వం. అది ఆ ఇద్దరిలోనూ ఉంది. అయితే కులాల మాట?

వాళ్ళిద్దరు ఒకరి కండ్లలో ఒకరు కాపురం పెట్టుకొన్నారు.

పెద్దోళ్ళ కండ్లలో కారం కొట్టినట్లయింది. రంగమ్మను గడపదాటి కాలుబటపెట్టొద్దని కట్టడి చేశాడు చెంగమనాయుడు.

నాలుగు గోడల మధ్య నలిగిపోతూ ఉంది రంగి. నిలబడిన చోట నిలబడలేకుండా కూర్చున్న చోట కూర్చోలేకుండా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు నర్సిమ్ములు.

ముద్దొచ్చే మేకపిల్లలా, పొలాల మీద పడి ఎగురుతూ దుముకుతూ గనిమల మీద పడ్తూ లేస్తూ నడుస్తూ, నవ్వుతూ నవ్విస్తూ, ఆనందమే రూపు దాల్చినట్లుగా తన వెంట పడే రంగిని నాలుగ్గోడల మధ్య ఊహించుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు నర్సిమ్ములు.

'ఏ చెట్టు నీడనో గుట్ట మీదనో కూర్చుని తనకోసం కుమిలి కుమిలి ఏడుస్తుంటాడేమో తన మాఁవ!' అని నర్సిమ్ముల్ని తలుచుకొని తపించి పోతూ ఉంది రంగి. ఆ తపనతో తల బాదుకొంటూ ఉంది రంగి!

నిజాయితీ కలిగిన ప్రేమ నిప్పులాంటిది! అదిమండి ఎదుటి గుండెను మండిస్తుంది. నర్సిమ్ములు ఆ గుండె మంటల్ని తట్టుకోలేకపోతున్నాడు. 'ఎట్లచెయ్యాల? ఏం చెయ్యాల?' అని ఆలోచిస్తున్నాడు.

"అవును. రంగిని లేవదీసుకుని ఎక్కడికైనా వెళ్ళిపోతే!... వెళ్ళిపోతే ఏమవుతుంది? ఏమవుతుంది? గట్టిగా రెక్కలున్నాయి. రెక్కాడితే డొక్కాడకుండా పోదు."

కొండంత ధైర్యం వచ్చింది నర్సిమ్ములికి ఆ ఆలోచనతో!

"అయితే ఈ సంగతి రంగికి తెలిసేదెట్లా? ఎవరితో చెప్పాల? ఎట్లా చెప్పాల?"

"పోనీ! ఒక చీటీ రాసి పంపిస్తే? అయ్యో రాఁవా! చదువే లేకపోతే ఇంక చీటెట్ల రాయాల? అదే నాలుగక్షరాలు నేర్చుకోనుంటే ఒక చీటీ రాసి పంపించి ఉండచ్చు కదా?"– అనుకునేకుందికి అతని మనస్సు చాలా బాధ పడింది. చదువుకోలేక పోయినందుకు కాసేపు బాధపడ్డాడు. తన అశక్తతను తలచుకొని ఏడ్చాడు. ఏంత బాధపడినా మరెంత ఏడ్చినా చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్నట్లుంటుందని తెగించి కరణం కొడుకు కాళ్ళే పట్టుకున్నాడు.

నర్సిమ్ములంతటివాడే కాళ్ళమీద పడేసరికి కరణం కొడుకు కరిగి నీరయిపోయాడు. భుజాలు పట్టి ఆప్యాయంగా పైకి లేపుతూ, "ఏం జరిగింది నర్సిమ్ములూ?" అంటూ అనునయంగా అడిగాడు.

"కర్నమయ్యా! కర్నమయ్యా!! నువ్వే జెప్పు కర్నమయ్యా! మనం బుట్నాక కులం బుట్టిందా? కులం బుట్నాక మనం బుట్నామా? రంగిని నేను పెండ్లి జేసుకుంటే ఈళ్ళకెందుకిట్లా కండ్లుబ్బి పోతాఉండాయే? నేనేమన్నాఒకరి కంచంలో కూడు పెరుక్కుంటా ఉండానా? ఇంకొకరి మంచంలో చోటు కోర్తా ఉండానా? లే దెవురి కొంపలయినా కూలస్తా ఉండానా? నా రంగిని గడప దాట్నీకుండా కట్టుబాటు జేసినారే? ఇదేమన్నా నాయంగా ఉండాదంటావా?"

"న్యాయమని నేను మాత్రం ఎలా చెప్తాను నర్సిమ్ములూ!"

"అందుకే నా రంగిని తీసుకోని నేనీవూరే వొదిలేసిపోతా. యాణ్ణో ఒకసోట కూలీ నాలీ జేసి బతుక్కుంటా!"

"సెభాస్! మొగోడంటే నువ్వే నర్సిమ్ములూ! ఆ మాదిర తెగిస్తేనే కానీ, ఈ పెద్దోళ్ళకు బుద్ధిరాదు. పో! నీ ఇష్టమొచ్చినచోటికి పో! కష్టపడే వాడికి ఎక్కడా కూడే! అయితే నన్నిప్పుడేం చెయ్యమంటావ్?"

"అంతమాటన్నావు సాలు. కర్నమయ్యా! సచ్చి ఇంకొకజల్మాన నీ కడపన పుట్తాను. ఏమిలే! ఒక్క సీటీరాసియ్యి. రేపు రేత్రికి నా రంగిని సెరువు కట్ట కింద సింతమానికాడికి రమ్మని. ఎవుర్సేతన్నా ఇచ్చి పంపించుకుంటా!"

కరణం కొడుకు కాసంతసేపు ఆలోచించాడు. ఆలోచిస్తూ తల ఆడించాడు. ఆ తలాడింపులో ఎన్ని తలంపులో ఏమో? ఏమాత్రం తామసించకుండా పరపరా నాలుగు అక్షరాలు రాసిచ్చాడు కరణం కొడుకు.

చీటీని చేతి కందుకొని పరుగందుకొన్నాడు నర్సిమ్ములు!...

పక్కింటి పిల్లోడు భయం భయంగా అందించిన చీటిని రంగి చేతికందు కొనింది.

అది మామ రాసిన చీటి అనుకొనేకుందికి రంగి మనసు రంగుల రాట్నమే అయింది!

సీటి సేతికందుకోని
సిగ్గుపడిపొయ్యింది
కండ్లకద్ది గుండెకద్ది
కడకు ముద్దు పెట్టుకుణ్ణిందీ!
మాంవ సీటి సదవలేక
మగ్గి మగ్గి ఏడ్సిందీ!
అట్ట తిరిగి ఇట్ట తిరిగి
తలగొట్టుకుణ్ణిందీ

సదువుకోక పొయ్యినందుకూ

సచ్చి దుగ్గుడయ్యింది!

ఏమి చెయ్యాలో తోచకుండా రంగి ఇంట్లోకి పెళ్ళోకి పెళ్ళోకి ఇంట్లోకి తిరిగింది. కాసేపు కళ్ళనీళ్ళు పెట్టుకొనింది. మరి కాసేపు తన చేత కాని తనానికి చిటపటలాడింది. ఆ తరువాత తన్ను తాను సమాళించుకొని పైకి లేచింది. ఆ ఇంటా ఈ ఇంటా పాచిపనులు చేసి బతుక్కొనే చెంగమ్మవ్వ చేతులుపట్టుకొనింది. పట్టుకొన్న చేతుల్లో ఆమెకు తెలియకుండానే అయిదు రూపాయలు నోటు పెట్టింది. ఆ మీదట చీటి చేతిలో పెట్టింది.

"సెంగమ్మవ్వా! సెంగమ్మవ్వా!! నీకు సేతులెత్తి మొక్కతాను. ఈ సీటట్టా రెడ్డి కొడుకు తావన సదివించుకొనిరా అవ్వా!" కన్నీళ్ళు చెంపలమీద జాలువారుతూంటే పట్టిన చేతుల్ని వదలకుండా ప్రాధేయపడింది రంగి.

చెంగమ్మవ్వ అక్కడున్నట్టే తిరిగి వచ్చింది.

అట్టా ఇట్టా చూసింది. ఎవ్వరూ కంట పడక పొయ్యేసరికి తెపరాయించుకొనింది. రెడ్డి కొడుకు చెప్పిన మాటే రంగితో చెప్పింది.

రంగిని పట్టేదానికి పగ్గాల్లేవు!

మనసిచ్చిన వాడే మనసిస్తే మగువ తెగింపుకు అవధులుండవు. ఆ ఆనందానికి హద్దులుండవు. క్షణమొక యుగంగా మరుసటినాటి రాత్రికోసం తహతహ పడుతూ ఎదురుచూస్తూ ఉంది.

కాలం ఆగదు. కొందరికి భారంగా కొందరికి వికారంగా కొందరికి హాయిగా జరిగిపోతూనే ఉంటుంది. అది దాని నైజం.

ఆ మరుసటి రోజు రాత్రి ఊరు మాటు మణిగింది. ఇంట్లో అందరూ మంచి నిద్రలో ఉన్నారు. రంగి నగానట్రా సర్దుకొనింది. ఉన్న చీరెల్ని, రవికెల్ని ఒక సంచి నిండుకు కుక్కుకొనింది.బుడిగ హుండీలో దాచుకొన్న డబ్బును సంచిలో భద్రపరచుకొనింది. ఇంటినుండి బయలుదేరింది. బయలుదేరుతూంటే ఏదో బాధ!... మరేదో మమకారం గుండెని పీకుతున్నాయి. 'కనిపెంచిన వాళ్ళనే కాదని పోతున్నావే?' అని ఎవరో నిలదీసి అడుగు తున్నట్లుంది. ముందుకు పోలేక వెనక్కు రాలేక కాసేపు కొట్టు మిట్టాడింది. గుండెతీపి ముందు కడుపుతీపి వీగిపోయింది. పుట్టిన ఇంటితో బంధాల్ని తెంచుకొని రంగి కాలు బయటపెట్టింది.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. అడుగుతీసి అడుగు పెట్టాలంటే కాళ్ళు అదురుతున్నాయి. ఆ అలికిడికి మేల్కొన్న వీధి కుక్కలు కొంపలు మునిగినట్లు అరుస్తూ వెంటబడి అంత లోనే తోకాడిస్తూ నోళ్ళు మూసుకొన్నాయి. బహుశా అవి కూడా రంగిని గుర్తించాయేమో? 'బ్రతుకుజీవుడా!' అని బెదురు జింకలాగా దిక్కులు చూస్తూ ఆమె నడుస్తూ ఉంది. చెంగమ్మ చెప్పిన మిషను బావి దరిదాపులకు చేరేటప్పటికి ఆ చీకటిలో ఒక మానవాకృతి మసక మసగ్గా

కనిపిస్తూ ఉంది. ఎక్కడలేని తెంపు వచ్చింది రంగికి. ఒక్క ఊపున పొయ్యి ఆ ఆకారాన్ని చుట్టేసింది.

రెండు చేతులు రంగిని బలంగా గుండె కదుముకొన్నాయి!

తడబాటులో గుండె దడ తీర్చుకొందామని రంగి ఆ గుండెమీది ఒక్క క్షణమంటే ఒక్కటే క్షణం వాలిందో లేదో ఆ గుండె తనది కాదని తెలిపోయింది. ఎగచూసి ఎగిరిపడింది.

పకపకా నవ్వుతున్నాడు రెడ్డి కొడుకు!

"నాకంతా తెలుసులేయే రంగీ! చదువూ సంధ్యలు లేని చవటతో లేచిపోతే వాడేం ఉద్యోగాలు చెయ్యబోతాడా? నిన్ను ఉయ్యాల్లో పెట్టి ఊపబోతాడా? కాకుంటే రిక్షా తొక్కబోతాడు. నిన్నొక గుడిసింట్లో పెట్టబోతాడు. అంతకు మించి ఏం చెయ్యబోతాడు? ఉడికిన పొట్ట పేగు తెంచలేని వెధవ కోసం ఎందుకే ఈ ఉబలాటం? నా మాటవిను రంగీ!"

నోట్లో మాట నోట్లో ఉండగానే చెంప 'ఛెళ్ళు' మనింది.

రెడ్డి కొడుకు రెచ్చిపోయాడు. పొగరుబోతు ఆంబోతులా పైనపడ్డాడు.

ఊరి ముందర చెరువులో ఎంద్రకాయలు కోసం వచ్చిన గుంతనక్కలు వికృతంగా అరుస్తున్నాయి. పొలాల మీద మిణుగురు పురుగులు చీకటిని చీల్చడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి.

చెరువు కింద చింతచెట్టు దగ్గర గుండె చేత పట్టుకొని ఎదురు చూస్తున్నాడు నర్సిమ్ములు.

పెనుగులాడి పెనుగులాడి చేతకాకుండా రంగి సొమ్మసిల్లి పడిపోయింది.

ఆకలి గొన్న కుక్క సంకటి కుండమీద పడినట్లు దొంగగొడ్డు చేను మేసినట్లు రెడ్డి కొడుకు స్పృహలేని ఒంటిమీద పడి కక్కుర్తి తీర్చుకొని కొండను పిండి చేసినంత ధీమాగా వెళ్ళిపోయాడు.

'రంగికి సీటీ అందిందోలేదో? అందుంటే ఎందుకు రాలేదబ్బా? అసలొస్తుందో? రాదో?' అని తహతహ లాడుతూ ఊరివైపు కండ్లు చించుకొని చూస్తున్నాడు నర్సిమ్ములు. ఆకు అల్లాడితే చాలు! ఆమేనేమో అని అదిరిపడి ఆశగా చూస్తున్నాడు. దాదాపు తెల్లవారుజాము వరకు ఎదురుచూసి ఎదురుచూసి ఇక రాదని నిర్ధారించుకొని ఇంటి ముఖం పట్టాడు. పడక మీద వాలినాడే కాని పడకపొందుంటే ఒట్టు!

కాలం ఒళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా కదులుతూ ఉంది.

రంగిలో కాస్త కదలిక కనిపించింది.

'సొమ్మసిల్లి పడున్న రంగీ
సిన్నంగా లేసి కూసుంది
సీగిట్లో తడిఁవి తడిఁవి
సీర సేతి కందుకుణ్ణిందీ!
పేలికలైన రైకను చూసి

పొల్లి పొల్లి ఏడ్సింది!
సీర సినిగె రైక సినిగె!
సీగిట్లో బతుకే సినిగె
మణుసు సినిగె మంచవత సినిగె
మాంచవ తల్రాత సినిగె
ఎలుగు మొకంవు సూడలేకా
ఎవురి ఎదట పడలేకా
మైలపడిన పాడు ఒంటితో
మాంచవకాడ సేరలేకా
సిన్నదాని కమ్మని బతుకూ
సెరువు లోన తేలిపోయె!'

తెల్లారింది!

చెరువులో తేలియాడుతున్న రంగి శవాన్ని చూసి ఊరు తెల్లపొయ్యింది!

రెండుబార్ల పొద్దెక్కింది. అప్పుడు నిద్రలేచాడు నర్సిమ్ములు. రాత్రంతా నిలువుగాళ్ళమీద నిలబడి ఎదురుచూశాడు గదా పాపం! బాగా అలసిపోయినట్లుంది. ఏ తెల్లవారుజామున పట్టిందో నిద్ర! లేచి చూసేటప్పటికి రెండు బార్ల పొద్దెక్కింది. లేస్తూనే చెవిని పడిన వార్త, 'రంగి చెరువులో దూకి చచ్చిపోయింది' అని.

ఆమాట చెవిని పడుతూనే 'రంగీ!' అని ఒక్క అరుపు అరిచాడు. అది అరువు కాదు. కారుమేఘాల సందుల్లో మిరుమిట్లు గొలిపే మెరుపు! ఆ మెరుపు ధాటికి ఇంట్లో వాళ్ళు దిగ్భ్రాంతి చెంది ఎక్కడి వాళ్ళక్కడ నిలువురాళ్ళలా నిలబడి పోయారు. నర్సిమ్ములు 'రంగీ! అయ్యో నా రంగీ!' అని అరుస్తూ చెరువు కట్ట వైపు పరుగెత్తు తున్నాడు. ఒంటి మీద బట్ట జారి పొయ్యేదికూడా తెలియకుండా పరుగెత్తుతున్నాడు. పిచ్చిగా పరుగెత్తుతున్నాడు. కంటి కొద్దీ ఏడుస్తూ నోటి కొద్దీ అరుస్తూ కాలికొద్దీ పరుగెత్తుతున్నాడు. పరుగెత్తి పరుగెత్తి చెరువు కట్టమీద నిలబడ్డాడు. చెరువంతా కలయచూశాడు. బొరోమని ఏడుస్తూ కుప్పగా కూలిపోయాడు. అంతలోనే ఎగిరిపడి లేచి చెరువులో దూకబోయాడు.

అడుగు ముందుకు పడకుండా ఎవరో గట్టిగా పట్టుకున్నారు. పట్టుకుంటే ఆగే తీరా అది? విదిలించి కొట్టాడు. అయినా పట్టుకున్న మనిషి కూడా సామాన్యుడేం కాదు.పట్టిన పట్టు వదలకుండా నిలబెట్టి 'ఏమిటి పిచ్చి?' అని అడిగాడు.

"నా రంగి! అయ్యో నా రంగి!" అని బావురుమంటూ నర్సిమ్ములు విదిలించి కొట్టిన అతన్నే కావిలించుకొన్నాడు.

"నీరంగి ఇంకా ఇక్కడెక్కడుంది? ఎప్పుడో చెంగమనాడిల్లు చేరింది!"

నర్సిమ్ములు గిరక్కున వెనక్కు తిరిగాడు. మళ్ళీ పరుగందుకొన్నాడు.

చెంగమనాయుడు ఇంటి ముందర తిన్నెలమీద వాకిట్లో ఎక్కడ చూసినా జనసందోహమే! ఆలోచన భారంతో కొందరి తలలు వాలిపోయాయి. కొందరు కన్నీళ్ళు దాచుకోవడానికి తలలు వంచుకొన్నారు. ఊళ్ళో ఆడవాళ్ళు ఒక్క ప్రవాహంలా ఇంట్లోకి జొరబడుతున్నారు. మళ్ళీ కాసేపటికి నోట్లో గుడ్డలు కుక్కుకుని కుములుతూ బయట పడుతున్నారు. ఏడుస్తున్న వాళ్ళను చూసి మరి కొందరు ఏడుస్తున్నారు. చెంగమనాయుడి ఇల్లూ వాకిలీ కన్నీటితో తడిసి ముద్దయింది.

వచ్చే వాళ్ళను పొయ్యేవాళ్ళను చూస్తూ చెంగమనాయుడు గుండె బాదుకుంటూ ఏడుస్తున్నాడు. నర్సిమ్ములు కంట పడీపడడంతోటే "ఈడి కెందుకొచ్చినావురా ఈడిబోగలోడా! ఇంకా ఎవుర్ని సంపాలనుకొని వచ్చినావురా ఇపిరి ముండాకొడకా! బంగారట్టా బిడ్డను నీ నోట్లో పెట్టుకుంటివి కదరా! నా కడుపుమంట నీకెదగా! పోరాపో! నా కంటికక్కనిపించకుండాపో!" అని అంటూ తల దబదబా బాదుకున్నాడు.

ఎదుటపడ్డ మనిషి ఎదురు చూడనట్టుగా మూతి పగలగొట్టినట్లయింది.

అసలే బాధ పడుతున్న కడుపులో చెయ్యేసి దేవినట్లయింది. తన రంగి చావుకు తాను కారకుడా? 'శివశివా!' అంటూ రెండు చెవులు మూసుకున్నాడు. వంచిన తలను పైకెత్తకుండా గిరక్కున వెనక్కు తిరిగి 'అవును! నా రంగిని నేనే పొట్టన పెట్టుకున్నాను...నేనే పొట్టన పెట్టుకున్నాను!" అని గొణుక్కుంటూ... గొణుక్కుంటూ ఏడుస్తూ పిచ్చివాడిలా వీధి వెంట పరుగెత్తు తున్నాడు.

చెంగమనాయుడు ఇంటి దగ్గర చేరిన వాళ్ళలో చెంగమ్మవ్వకూడా ఉంది. ఆమె కడుపులో అగ్గి పోసినట్లుంది. ఆ మంట ఆరేదీ తీరేది కాదు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నా ఆమె కండ్లు నర్సిమ్ములు కోసం గాలిస్తూనే ఉన్నాయి. నర్సిమ్ములుకు వాకిట్లో జరిగిన మర్యాదల్ని గమనించింది. చల్లగా అక్కడనుండి జారుకొనింది. ఈ ఇంటి సందు ఆ ఇంటి సందులగుండా నడక పరుగ్గా అడ్డదారి మీద పడి నర్సిమ్ముల్ని అటకాయించింది.

"నాయినా! నర్సిమ్ములూ!" అప్యాయంగా పిలిచింది చెంగమ్మవ్వ.

ఆ పిలుపు నర్సిమ్ముల్ని ఒక్క క్షణం నిలబెట్టగలిగింది.

"అది కాదు నాయినా! ఆ అమ్మిని మిసినుబాయి కాడికి రమ్మని నువ్వేడ ఉండిపోతివి నాయినా?"

"మిసినుబాయి కాడికా?" రెట్టించాడు నర్సిమ్ములు.

"కాకుంటే ఇంకేడికి నాయినా? నేనే గద నాయినా నువ్వు రాసి పంపించిన సీటీ రెడ్డి కొడుకు దగ్గర సదివించుకోనొచ్చింది."

"ఆఁ!" అంటూ అదిరి పడ్డాడు నర్సిమ్ములు. అంతే! అతని కండ్ల ముందు అంతా ఒక్కసారి గిర్రున తిరిగింది. 'నేను చెరువు కట్టకింద చింతమాను కాడికిరమ్మంటే, ఆయదవ కర్నం

కొడుకేమి రాసినాడో ఏంవో! వాడు రాసిందాన్ని ఈ యదవ రెడ్డి కొడుకిట్లా సదివి సెప్పినాడు. అప్పిటికి ఈళ్ళ కడుపుల్లో ఏంవో పెట్టుకున్నారన్న మాట. అట్లా పెట్టుకునే ఈడు మిసినుబాయి కాడ కాపు కాసినాడు. నా రంగిని దోసుకున్నాడు. అందుకే నా రంగి బతుకు సెరువు పాలయింది. అదా సంగతి?"

పండ్లు పటపట కొరికాడు. అక్కడినుండి పరుగందుకున్నాడు. ఇల్లు చేరాడు. చూరులో మచ్చుకత్తి చేతికందుకున్నాడు. అదే పరుగుమీద రెడ్డింట్లో దూరాడు.

రంగి చెరువులో దూకి చస్తుందని ఊహించని రెడ్డి కొడుకు రానున్న పరిణామాల్ని ఊహిస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాడు. ఒక్క లగువులో వాడి మీదికి దూకాడు. ఒకే ఒక్క వేటుతో తల తెగనరికాడు. ఎడమచేతిలో తల. కుడిచేతిలో మచ్చుకత్తి! వీరావేశంతో ఊరి వీధుల్లో నడుస్తూంటే నర్సిమ్ములు మీద ఈగ వాలుంటే ఒట్టు. అదే నడకతో చెరువు కట్ట దాటాడు. అదే ఆవేశంతో పక్కన పట్టణాన పోలీసు స్టేషన్‌లో దూరాడు. తనకు జరిగిన అన్యాయాన్ని తాను చేసిన ప్రతీకారాన్ని తనకు తానుగా ఒప్పుకున్నాడు.

పోలీసులు కేసు పెట్టారు. ఆ కేసును న్యాయ స్థానాలు విచారించాయి. నర్సిమ్ములుకు ఏడేండ్లు కఠిన శిక్ష పడింది!...

ఏడేండ్లు కఠిన శిక్షను అనుభవించిన నర్సిమ్ములు మళ్ళీ స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. వస్తూ వస్తూ ఆ చెరువు కట్టమీద కూర్చున్నాడు.

అయితే ఆ నాటి నర్సిమ్ములు వేరు. ఈ నాటి నర్సిమ్ములు వేరు.

ఆ నాటి నర్సిమ్ముల్లో నరుడు లేడు. సింహం మాత్రమే ఉంది.

ఈనాటి నర్సిమ్ముల్లో సింహంలేదు. నరుడు మాత్రమే ఉన్నాడు.

నరుడుగా మిగిలిన నర్సిమ్ములు మహాతత్త్వవేత్తలా నవ్వుతున్నాడు.

జైలు నుండి బయటపడగానే తన రంగి తనకు దూరం కావడానికి కారకుల్లో ఇంకొకడు కర్నం కొడుకు! వాడిని ముందుగా సాగనంపాలనుకున్నాడు. అయితే ఇప్పుడు నర్సిమ్ములు చదువుకున్నవాడు. కేవలం అక్షరాల్ని మాత్రమే కాదు. లోకాన్ని! ఒక్క సంవత్సరం రెండు సంవత్సరాలు కాదు. ఏడుసంవత్సరాలు.

ఇప్పుడు నర్సిమ్ములు జ్ఞాని!

అందుకే చెరువుకట్టమీద చెట్టు మరుగులో లోకజ్ఞానిలా ఆలోచిస్తున్నాడు.

విఫలమైన ప్రేమ మనిషిలో విద్వేషాగ్ని రగిలిస్తుంది. కసిని పెంచుతుంది. ఆ కసి బతుకుల్ని మసి చేస్తుంది. కానీ నిజమైన ప్రేమ కోరేదేమిటి? ద్వేషాన్నా? పగనా? కసినా? పంతాన్నా? త్యాగాన్నా? కాదు. దేన్నీ కాదు. మరి దేన్ని? తన లాంటి బతుకు ఇతరులకు రాకూడదని! అయినా వచ్చింది. ఎందుకు వచ్చింది?

నాలుగు అక్షరాలు కలిపి రాసే యోగ్యత తనకు ఆ అక్షరాల్ని కూడి కూడి చదివే తెలివి రంగికి ఉండి ఉంటే ఇన్ని అనర్థాలు జరిగేవికావు. రాత నేర్చి ఉంటే తమ తలరాతలు ఇలా ఉండేవి కాదేమో? జరిగిందేదో జరిగింది! ఇక ఇలా జరగడానికి వీల్లేదు. ఈ ఊర్లో ఎవ్వరూ ఇంక రంగిలా బలి కావడానికి వీల్లేదు.

అంతేనా? కాదు. ఊరి పెద్దలు లాలూచీ పడి అమాయకులైన గ్రామీణులతో ఆడుతున్న ఆట లెన్ని? తప్పుడు వేలిముద్రలతో నెత్తిన రుద్దుతున్న అప్పులెన్ని? ఈ పగటి దోపిడీలు అంతం కావాలంటే అవసరం అక్షరజ్ఞానం. ఆ జ్ఞానం ఒకరి సొత్తు కూకూడదు. రంగిపై తన ప్రేమ కోరుతున్నదదే. అప్పుడే రంగి ఆత్మ శాంతిస్తుంది కూడా!

నర్సిమ్ములు ఇలా ఆలోచిస్తూ ఉంటే, ఊళ్ళో గుళ్ళో దేవుడి పూజ జరుగుతూ ఉందేమో? గణగణ గంట మోగుతూ ఉంది. ఆ తొలిజాము తొలివేళ ప్రశాంత వాతావరణంలో గుడిగంటల శబ్దం చెవుల్లో కొట్టినట్లు వినిపిస్తూ ఉంది.

"గుడి గంటలు కాదు నేను వినవలసింది. ఇక మీదట బడిగంటలు కూడా!" అనుకొంటూ కృతనిశ్చయంతో పైకి లేచాడు నర్సిమ్ములు!

అతని నిర్ణయానికి మరింత బలం సమకూర్చడానికి కన్నట్లుగా గుడి గంటలు ఇంకా మోగుతూనే ఉన్నాయి! ●

ఆంధ్రప్రభ
(11, మే 1983)